నిర్వహణ అస్తవ్యస్తం

- అలంకారప్రాయంగా సెగ్రిగేషన్ షెడ్లు
- గ్రామాల్లో తూతూ మంత్రంగా తడి, పొడిచెత్త సేకరణ


సిర్సపల్లి గ్రామ శివారులోని సెగ్రిగేషన్ షెడ్డులో పేరుకుపోయిన తడి,పొడిచెత్త

హుజూరాబాద్‌రూరల్: పరిశుభ్రమైన గ్రామాలుగా మార్చడమే లక్ష్యంగా గత ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామ పంచాయతీలో సెగ్రిగేషన్ షెడ్డు నిర్మించారు. అత్యుత్తమ లక్ష్యంతో నిర్మించిన షెడ్లు అలంకారప్రాయంగా మారాయి. నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రభుత్వ ఫలితం నీరుగారుతోంది. హుజూరాబాద్ మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించారు. గ్రామాల నుంచి సేకరించిన చెత్తను గ్రామ శివారులో ఉన్న సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి తడి, పొడిచెత్త వేరు చేయడం ప్రధాన లక్ష్యం. లక్ష్యానికి తూట్లు పడుతున్నాయనే విమర్శలు వెలువడుతున్నాయి.

చెత్త సేకరణలో లోపాలు

ఇళ్ల నుంచి తడి, పొడిచెత్త సేకరణకు ప్రభుత్వ హయాంలో ఇంటికి రెండు చెత్తడబ్బాలను అందించారు. తడి,పొడిచెత్త వేరు చేసి గ్రామ పంచాయతీ సిబ్బందికి అందించాలనే ఉద్దేశంతో వీటిని అందిస్తే లక్ష్యం కాస్తా అటకెక్కింది. గ్రామాల్లో ఉదయం పూట తిరుగుతున్న చెత్త వాహనాలకు ఇళ్లల్లోని తడి, పొడి చెత్త ఒకే దాంట్లో వేసి ఇస్తుండటంతో గ్రామపంచాయతీ సిబ్బంది సైతం అలానే డంప్ చేస్తున్నారు. డంప్ చేసిన చెత్తను నేరుగా సెగ్రిగేషన్ షెడ్డులోకి డంప్ చేస్తుండటంతో తడి, పొడి చెత్త సేకరణ సవాలుగా మారుతోంది. చెత్త ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలనే ఉద్దేశంతో సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీటి నిర్మాణాలకు రూ.లక్షలు వెచ్చించి నిర్మిస్తే ప్రస్తుతం పట్టించుకునేవారు కరువయ్యారు. వీటి ద్వారా ఎలాంటి ప్రయోజనం చేకూరకపోవడంతో ప్రభుత్వం లక్ష్యం నీరుగారుతోంది. సెగ్రిగేషన్ షెడ్డులో కేవలం గ్రామాల నుంచి సేకరించిన బీరు సీసాలు, ప్లాస్టిక్ వస్తువులు తప్పా తడి, పొడిచెత్త సేకరణ జరగడం లేదు.

స్థలం కబ్జా కాకుండా చర్యలు చేపట్టండి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- చింతకుంట గురుకుల విద్యాలయం ఆకస్మిక తనిఖీ


విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి

కొత్తపల్లి: చింతకుంటలోని రాష్ట్ర సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాల స్థలం కబ్జా కాకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశించారు. ఎంతటి పెద్ద మనుషులున్నా వదిలిపెట్టొద్దని, సర్వే చేయించి హద్దులు నిర్ణయించాలని సూచించారు. ప్రత్యేక అభివృద్ధి నిధి కింద ప్రహరీ నిర్మించాలని తెలిపారు. చింతకుంటలోని రాష్ట్ర సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ మెస్‌లోని అన్నం, కూరలను పరిశీలించి దొడ్డు అన్నంపై ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పౌరసరఫరాల శాఖ అధికారితో ఫోన్‌లో మాట్లాడి రెండు రోజుల్లో సన్నం బియ్యం సరఫరా చేసి భోజనం చేసి తనకు చెప్పాలని ఆదేశించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి వంటలపై కితాబిచ్చారు. అనంతరం మెస్ స్టోర్‌రూం, కిచెన్, పరిసరాలను పరిశీలించారు. మెస్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతికి ఫోన్‌లో సూచించారు. 640 మంది విద్యార్థులు చదువుతున్న ఈ విద్యాలయం అభివృద్ధి చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. వాటర్ ప్లాంట్, ప్రహరీ, మౌలిక వసతులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. జాతీయస్థాయి వాలీబాల్ క్రీడాకారులున్నందున వాలీబాల్ కోర్టును తక్షణమే ఏర్పాటు చేసేలా ఆదేశాలివ్వనున్నట్లు తెలిపారు. బహుజన విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా మౌలిక వసతులు కల్పిస్తామని అడ్లూరి స్పష్టం చేశారు.

సంక్షిప్త వార్తలు

● 108 వాహనం తనిఖీ

శంకరపట్నం: కేశవపట్నంలో సోమవారం 108 వాహనాన్ని ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్ తనిఖీ చేశారు. వాహనంలోని వైద్యపరికరాలు, మందులు, రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరు బాగుందన్నారు. క్షతగాత్రులకు మెరుగైన సేవలు అందించాలని ఈఎమ్‌టీ సతీశ్‌రెడ్డి, పైలెట్ ఖాజాఖలీఉల్లాకు సూచించారు.

● కోతుల నుంచి రక్షణ కల్పించాలి

మానకొండూర్: మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో కోతులు, కుక్కల బెడద కారణంగా గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వీటి బారి నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ మాజీ సర్పంచ్ ఎరకల శ్రీనివాస్‌గౌడ్ సోమవారం కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు.

● ఎమ్మెల్యేకు కిష్కిందపల్లె వాసుల గోడు

శంకరపట్నం: వినాయక మండపం నిర్మించుకొని 25 ఏళ్లు గడిచాయని ఓ వ్యక్తి విగ్రహం ఏర్పాటు చేసుకోనివ్వకుండా అడ్డుకుంటున్నాడని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు కిష్కిందపల్లె వాసులు గోడు వెళ్లబోసుకున్నారు.

● యూరియా పంపిణీ హామీ

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామంలో యూరియా పంపిణీ చేయాలని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్‌బాబు దృష్టికి మార్కెట్ డైరెక్టర్ మాదాసు సునీల్ తీసుకెళ్లారు. రెండు రోజుల్లో చల్లూరులో యూరియా పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వివరించారు.

● సమస్యల పరిష్కారంలో విఫలం

వీణవంక: రైతుల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు నాగిడి సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని ఘన్ముక్కుల గ్రామంలో సోమవారం మాట్లాడారు.

● రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

జమ్మికుంట: పట్టణం, మండంలోని గ్రామాల రైతులు రైతుబీమాకు 13వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, జూన్ వరకు కొత్త పట్టాదారు పాస్‌బుక్ వచ్చిన రైతులు పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జమ్మికుంట ఏవో ఖాదర్ హుస్సేన్ సోమవారం ప్రకటనలో తెలిపారు.

● నకిలీ ఓట్లపై చర్చ జరగాలి

హుజూరాబాద్: దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో బయటపడుతున్న నకిలీ ఓట్లపై పార్లమెంట్ లో చర్చ జరగాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సొల్లు బాబు సోమవారం ప్రకటనలో కోరారు.

● మోడల్ స్కూల్ తనిఖీ

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం మోడల్ స్కూల్‌ను సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్యజైనీ తనిఖీ చేశారు. 8, 9, 10వ తరగతి విద్యార్థినులతో ప్రత్యేకంగా సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు.

● మిగులు పనులు పూర్తి చేయాలి

చొప్పదండి: పట్టణ శివారులోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను మిగులు పనులు పూర్తి చేయడానికి ప్రభుతం నుంచి నిధులు మంజూరు చేయించాలని పట్టణ అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు సోమవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వినతిపత్రం అందించారు.

● సబ్‌సెంటర్ సందర్శన

మానకొండూర్: మండలంలోని అన్నారం సబ్‌సెంటర్‌ను వరల్డ్ బ్యాంక్ కన్సల్టెన్సీ టీం సభ్యులు సోమవారం సందర్శించారు. గ్రామంలో తాగునీటి వ్యవస్థ, డ్రైనేజీ, శానిటేషన్ గూర్చి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

● ఆలయాల్లో చోరీ

గంగాధర: మండలంలోని కొండన్నపల్లి గ్రామ శివారు సహస్ర లింగేశ్వరస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు హుండీల తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. గ్రామస్తుల సమాచారంతో సోమవారం ఎస్సై వంశీకృష్ణ ఆలయాలను పరిశీలించారు. చోరీ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

● ఇసుక ట్రాక్టర పట్టివేత

శంకరపట్నం: మండలంలోని ఆముదాలపల్లి శివారులో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నామని కేశవపట్నం ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. వీణవంక మండలం కోర్కల్ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా హుజూరాబాద్‌కు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు.

● మిల్లర్లపై పోలీసులకు ఫిర్యాదు

శంకరపట్నం: మార్కెట్ లైసెన్స్ తీసుకోకుండా రైస్‌మిల్లులు, సీడ్ ప్లాంట్లు నిర్వహిస్తున్న వారిపై హుజూరాబాద్ వ్యవసాయమార్కెట్ కార్యదర్శి అశోక్ సోమవారం కేశవపట్నం ఎస్సై శేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.

● చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హుజూరాబాద్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు. .పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన కొండపర్తి సమ్మయ్య(50) ఈ నెల 9న బైక్‌పై మండలంలోని కాట్రపల్లి నుంచి ఇంటికి వస్తుండగా లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలోచికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు అశోక్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

● కేసు నమోదు

ఇల్లందకుంట: విధులకు ఆటంకం కలిగించడంతోపాటు దుర్భాషలాడిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 3న తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం అధికారుల ఉత్తర్వుల మేరకు సీనియర్ అసిస్టెంట్ వేముగంటి అనిల్‌కుమార్, అటెండర్ గొస్కుల రాకేశ్ విధులు నిర్వహిస్తున్నారు. జమ్మికుంటకు చెందిన గట్టు సాయిరాం, పసునూటి శివ కార్యాలయంలో పలికి వచ్చి సెలవు రోజున ఎందుకు పనిచేస్తున్నారని దూషిస్తూ విధులకు ఆటంకం కలిగించారు. సీనియర్ అసిస్టెంట్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు.

● భక్తుల మనోభావాలు దెబ్బతీశాడని..

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని బీరన్న ఆలయం ఆవరణలోని మర్రిచెట్టు కొమ్మలు, వేర్లు, ఊడలను నరికేసిన గుడికందుల ఎల్లయ్య అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా చేశాడని వెంగళ రాయమల్లు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై క్రాంతి కుమార్ తెలిపారు.

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం


మాత్రలు వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్‌లో నియోజకవర్గాల్లో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. నులి పురుగుల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కళాశాల సెక్రటరీని సన్మానిస్తున్న విద్యార్థులు


హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో 2001–05 బ్యాచ్ కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, ఐటీ బ్రాంచ్‌ల విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల సెక్రెటరీ, మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కళాశాలలో చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడటం ఆనందంగా ఉందని, పోటీ ప్రపంచానికి అనుగుణంగా కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

ప్రజావాణి ఫిర్యాదులు

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారి పట్టించుకోవడం లేదంటూ ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ రాష్ట్ర కన్వీనింగ్ మెంబర్ కొలుగూరి సూర్యకిరణ్ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మున్సిపల్ అనుమతులు ఒకచోట తీసుకొని నిర్మాణాలు మరోచోట జరుగుతున్నాయని, దీనికి తోడు సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

జమ్మికుంట: పట్టణంలోని జమ్మికుంట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సీఐపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) (ప్రజా పంథా), పీడీఎస్‌యూ జిల్లా కమిటీ అధ్యక్షుడు అంగిడి కుమార్, కరీంనగర్ నాయకులు ఇనుకొండ ధీరజ్ ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జమ్మికుంట ఎక్సైజ్ పరిధిలోని పట్టణ, గ్రామాల్లో బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తున్న మద్యం దుకాణాల లైసెన్స్ రద్దు చేయాలని, బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 6న జమ్మికుంట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, ఇప్పటివరకు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కమీషన్లు తీసుకుంటున్నారని చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వర్షం నీటి కష్టాలు




శంకరపట్నం: కేశవపట్నంలో సోమవారం గంటపాటు దంచికొట్టిన వర్షంతో రోడ్డుపై నీరు నిలిచింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు. బస్టాండ్ ప్రాంగణంలో నీరు నిలవడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, వారసంతకు వచ్చినవారు బురదనీటిలో నుంచి బస్టాండ్‌కు చేరుకున్నారు. కేశవపట్నం ప్రధాన రోడ్డుపై వర్షం నీరు నిలవడంతో దుకాణాల్లో వస్తువులు కొనుగోలు చేసేందుకు ప్రజలు అవస్థలుపడ్డారు.



వీణవంక: మండలంలోని నర్సింగాపూర్ గ్రామ ఆలయం వద్ద రోడ్డు మధ్యలో ఉన్న డ్రెయినేజీ పైకప్పు కూలిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేసేవారు కరువయ్యారు. దీంతో గ్రామస్తులు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు హెచ్చరిక, సూచిక బోర్డులాగా రెండు కర్రలు ఏర్పాటు చేశారు. ఇటీవల ఓ ద్విచక్ర వాహనదారుడు గుంతను గమనించకపోవడంతో గాయాలపాలయ్యాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సురేశ్, పంచాయతీ కార్యదర్శి, నర్సింగాపూర్ నం.99594 52681

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

- కలెక్టర్ పమేలా సత్పతి


ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న కలెక్టర్

కరీంనగర్‌టౌన్: విద్యార్థులు పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని సోమవారం కరీంనగర్‌లోని సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని బాలబాలికలకు నులి పురుగుల నిర్మూలన కోసం ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. 1–19 ఏళ్ల వయస్సు కలిగిన వారందరికీ తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలని సూచించారు. ఎవరైన తప్పిపోతే మలి విడతగా చేపట్టే కార్యక్రమంలో తప్పనిసరిగా మాత్రలు వేసేలా చూడాలన్నారు. ఈ మాత్ర వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని, ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఇతర వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాక్ పోలింగ్

రామడుగు: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ లో సోమవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులకు ఓటుహక్కు వినియోగం, ప్రాధాన్యత గూర్చి ప్రిన్సిపాల్ ఆడెపు మనోజ్‌కుమార్ అవగాహన కల్పించారు. తరగతి హెడ్‌ను ఓటింగ్ ద్వారా ఎన్నుకున్న విద్యార్థులు అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, సంధ్య, హరిప్రసాద్, అశోక్ పలువురు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి హెల్త్ స్కీం అవసరం


మంత్రి శ్రీధర్‌బాబుతో టీఎన్జీవో నాయకులు

కరీంనగర్ అర్బన్: ఉద్యోగుల సంక్షేమానికి హెల్త్ స్కీం తప్పనిసరి అవసరమని టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని సుడా కార్యాలయంలో రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి బొకే అందజేశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను, ముఖ్యంగా బెనిఫిట్స్ చెల్లింపుల ఆలస్యం, హెల్త్ స్కీం అమలు అవసరాన్ని వివరించారు. కొంతకాలంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలను మంత్రికి తెలిపారు. టీఎన్జీఓల సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఒంటెల రవీందర్ రెడ్డి, కేంద్ర సంఘం నాయకులు నాగుల నరసింహస్వామి, గూడ ప్రభాకర్ రెడ్డి, సర్దార్ హర్మీందర్ సింగ్, జిల్లా కోశాధికారి కిరణ్‌కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, కార్యదర్శి వెలిచాల సుమంతరావు, 4వ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి శంకర్, నాయకులు ఎడ్ల మహేశ్, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



ఇల్లందకుంట: హుజూరాబాద్‌లో 17న నిర్వహించే పంచాయతీ కార్మికుల జిల్లా ఐదో మహాసభను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి కొప్పుల శంకర్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులతో కలిసి జిల్లా మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోడేటి దేవేందర్, మొగిలి, మారపల్లి శ్రీకాంత్, రాకేశ్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ధర్నా


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రామడుగు: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రామడుగు మండల పరిషత్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు సోమవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు.

క్లుప్తంగా

స్థలం కేటాయించాలని కేంద్ర మంత్రికి వినతి


కేంద్రమంత్రి సంజయ్‌తో సంఘం సభ్యులు

రామడుగు: మండలంలోని తిర్మలాపూర్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌కు వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మంజూరు చేయాలని అలాగే కార్యాలయం కోసం ప్రభుత్వ స్థలం కేటాయించాలని సంఘం అధ్యక్షుడు గంట్ల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు కట్ట రవీందర్, సంఘం ప్రతినిధులు మన్నె కిషన్ చందర్, పొన్నం సత్యనారాయణ, పుల్కం రాజమల్లు పలువురు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని బీజేపీ నాయకుల ర్యాలీ


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

శంకరపట్నం: మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే పరిష్కరించాలని బీజేపీ నాయకులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. కేశవపట్నం అంబేడ్కర్ విగ్రహం నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అరుంధతి కల్యాణమండపం, కేశవపట్నం–చెర్లపల్లి, అర్కండ్ల బ్రిడ్జి, కాచాపూర్–రాజాపూర్ రోడ్డు మరమ్మతుకు ఎమ్మెల్యే నిధులు మంజూరు చే యించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని సూపరింటెండెంట్ రాఘవేందర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, నాయకులు సమ్మిరెడ్డి, దొంగల రాములు, దండు కొంరయ్య,నరేందర్, సాగర్, సారయ్య, శ్రీనివాస్, జైపాల్, తదితరులు పాల్గొన్నారు.

గుంత పూడ్చివేత

సైదాపూర్: మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామ శివారులో సైదాపూర్–హుజూరాబాద్ ప్రధాన రోడ్డు కల్వర్టు వద్ద ఏర్పడిన పెద్ద గుంతను కాంక్రీట్‌తో రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆకుల రమేష్ సోమవారం పూడ్చివేయించారు. రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడి ఏళ్లు గడిచినా, పాలకులు, అధికారులు పట్టించుకోలేదని, ప్రయాణికులు, వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని రమేశ్ గుంతను పూడ్చివేయించగా పలువురు ఆయనను అభినందించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించాలని బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

సన్మానం

జమ్మికుంట: మున్నూరుకాపు సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్‌ను కుల బాంధవులు సోమవారం మ ర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మున్నూరుకాపులు ఐకమత్యంతో రాజకీయ, సామాజిక అవకాశాలను సాధించుకుందామన్నారు. కార్యక్రమంలో కుమార్, రవి, అజయ్‌కుమార్, శ్రీని వాస్, మహేందర్, అన్వేశ్, మహేశ్, అభిలాశ్, శ్రావణ్‌కుమార్, వినయ్‌కుమార్, విష్ణు పాల్గొన్నారు.

సైకిళ్ల పంపిణీ

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట ప్రభుత్వ జెడ్పీ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ జన్మదినం సందర్భంగా సోమవారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి సంపత్ ఆధ్వర్యంలో నాయకులు విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, మండల దళిత మోర్చా అధ్యక్షుడు సాగర్, బీజేవైఎం మండల కార్యదర్శి సాయికృష్ణ, గ్రామ కార్యదర్శి సంపత్, బూత్ అధ్యక్షుడు ఎన్నం సంతోష్, నాయకులు గూల్ల రాజు, సంతోష్, వెకంటేశం, సంపత్‌రెడ్డి, రమేశ్ నాయకులు కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం



కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ రాష్ట్ర ప్రిజనరీ వెల్ఫేర్ సొసైటీ అధికారులకు సోమవారం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, హరిహర జ్యువెలర్స్ అధినేత చిట్టుమల్ల శ్రీనివాస్ రూ.లక్ష విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో కరీంనగర్ జైల్ సూపరింటెండెంట్ విజయ్ డానీ, జైలర్స్ శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.